# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అభివృద్ధి వికేంద్రీకరణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **హైదరాబాద్‌కు మెట్రో రెండో దశ మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది కాలంలో 2 వేల 392 కోట్ల రూపాయలతో గ్రామీణ రహదారులు అభివృద్ధి చేశామని ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.**
4. **'గోదావరి-బనకచర్ల అంశంపై త్వరలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయనుందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో నల్ల బర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.**

==========================

అభివృద్ధి వికేంద్రీకరణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిన్న 7వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 19 ప్రాజెక్టులకు సంబంధించి 28 వేల 546 కోట్ల రూపాయల ప్రాజెక్టులకు ఆమోదం తెలియజేసింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవకాశం కల్పించాలన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఏర్పాటు అయ్యే పరిశ్రమలు, ప్రాజెక్టులు, పెట్టుబడుల ద్వారా కల్పించే ఉద్యోగాలకు సంబంధించిన వివరాలను ఆన్ లైన్ పోర్టల్ లో పొందుపర్చాలని ఆదేశించారు. అలాగే క్లస్టర్ల వారీగానూ ఈ పరిశ్రమల మ్యాపింగ్ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు.

-------------------------

హైదరాబాద్‌కు మెట్రో రెండో దశ మంజూరు చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నిన్న కేంద్ర మంత్రితో సమావేశమై మెట్రో రెండో దశకు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్‌లో 76.4 కిలో మీటర్ల పొడవైన మెట్రో దశ నిర్మాణ అవసరాన్ని కేంద్రమంత్రికి వివరించారు. 24 వేల 269 కోట్ల రూపాయల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా

ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్‌లో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని పేర్కొన్నారు.

---------------------------

ప్రతి ఒక్కరి జీవితంలో యోగా జీవితంలో భాగం కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో యోగాంధ్రపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడారు. రాష్ట్రమంతా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలో రేపు లక్షా 30 వేల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు జరుగుతాయని తెలుపుతూ,

వాయిస్.. 34 సెకన్లు

---------------------------

యోగాకు ప్రాచుర్యం కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. యోగాభ్యాసం ద్వారా ప్రజారోగ్యానికి కలిగే ప్రయోజనాల దృష్ట్యా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంపై నెల రోజులుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. యోగ దినోత్సవ జాతీయ ప్రధాన కార్యక్రమం 5 లక్షల మంది యోగా అభ్యాసకులతో విశాఖపట్నం బీచ్ నుండి భీమునిపట్నం బీచ్ వరకు రేపు జరగనుందని చెప్పారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 2 కోట్ల మంది యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది కాలంలో 2 వేల 392 కోట్ల రూపాయలతో గ్రామీణ రహదారులు అభివృద్ధి చేశామని ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా 2024-25 సమగ్రాభివృద్ధి నివేదిక పేరుతో ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను సామజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన నిన్న విడుదల చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 10 వేల 572 కోట్లు గ్రామీణాభివృద్ధికి ఖర్చు చేశామని పేర్కొన్నారు. అలాగే పిఠాపురం నియోజకవర్గంలో 308.35 కోట్ల రుపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమగ్ర అభివృద్ధి నివేదిక విడుదల చేశామని తెలిపారు.

---------------------------

'గోదావరి-బనకచర్ల అంశంపై త్వరలో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయనుందని తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ను నిన్న ఆయన కలిసి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అభ్యంతరాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. సమావేశం అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నల్ల బర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కె.

అచ్చెన్నాయుడు తెలిపారు. బాపట్ల జిల్లా పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..26 సెకన్లు

---------------------------

పోలవరం కాలువలను విస్తరించడంతో పాటు రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును సమాంతరంగా చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడారు, పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును దశల వారీగా పూర్తి చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు కాలువలను విస్తరించాలని తెలుపుతూ,

వాయిస్ ..36 సెకన్లు

---------------------------

తిరుమలలో భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చామని తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్యచౌదరి తెలిపారు. తిరుమలలో ఆర్టీసీ బస్సుల ఉచిత సర్వీసు నిన్న ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తిరుమలలో ప్రైవేట్ వాహనాల అధిక ఛార్జీలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ట్రాఫిక్, కాలుష్య నియంత్రణకు ఈ ఉచిత సర్వీసులు ఉ పయోగపడతాయని చెప్పారు. తిరుమలలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లేలా ధర్మరథాలు తిరిగే మార్గంలోనే ఆర్టీసీ బస్సులూ సేవలు అందిస్తాయని ఆయన తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

ప్రపంచ శరణార్థుల సంక్షేమ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. వివిధ దేశాలకు శరణార్థులుగా వెళ్లే వారి సంక్షేమాన్ని కాంక్షించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ 20వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. మొదటిసారి 2001 సంవత్సరంలో ప్రపంచ శరణార్థుల దినోత్సవం జరిగింది.

====================